సాక్షి మంచిర్యాల

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



సీవోఈ నోటిఫికేషన్ ఎప్పుడో?

బెల్లంపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) కళాశాలల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. 8లో▸



న్యూ ఇయర్ సందడి

న్యూఇయర్ వేడుకలను యువత రొటీన్‌కు భిన్నంగా జరుపుకునేందుకు ఉత్సాహపడుతున్నారు. స్నేహితులు, ఆత్మీయుల మధ్య జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
30.0 /19.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం: న్యూఇయర్ వేడుకల్లో విషాదకర సంఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని డీసీపీ ఎగ్గడి భాస్కర్ పోలీసు సిబ్బందికి సూచించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి డిసెంబర్ 31న రాత్రి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సి నిబంధనలపై పలు సూచనలు చేశారు. రాత్రి 11 దాటిన తర్వాత పట్టణంలోని ప్రధాన చౌరస్తాల వద్ద వాహనాల తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తూ నిరంతర నిఘా ఉంచాలన్నారు. ఆలయాలు, మజీదులు, చర్చిల వద్ద భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను రాత్రి బయటకు పంపించవద్దన్నారు. కుటుంబ సమేతంగా ఆహ్లాదకర వాతావరణంలో న్యూఇయర్ వేడుకలు జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ ఆర్.ప్రకాష్, సీఐ ప్రమోద్‌రావు, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నరేష్‌కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు

మంచిర్యాలక్రైం: డిసెంబర్ 31న రాత్రి మద్యం సేవించి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని డీసీపీ ఎగ్గడి భాస్కర్ హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లు, పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం మత్తులో అల్లర్లు, గొడవలు, ఇతరులను బెదిరింపులకు పాల్పడడం, మహిళలను ఇబ్బందులకు గురిచేయడంలాంటి అఘాయిత్యాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్, సీఐ ప్రమోద్‌రావు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి రైతుల ఆందోళన



రోడ్డుపై బైఠాయించిన రైతులు

చెన్నూర్‌రూరల్: పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎల్లక్కపేటలో రైతులు రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం టోకెన్లు ఇచ్చి సమయం ముగిసిందని కొనుగోళ్లు నిలిపివేశారన్నారు. పండించిన పంటలు అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్నామన్నారు. విషయం తెలుసుకున్న చెన్నూర్ మార్కెట్ కమిటీ సెక్రెటరీ ఆంజనేయులు, ఎస్సై సుబ్బారావు సంఘటన స్థలానికి చేరుకుని సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు.

‘చెరువు ఎఫ్‌టీఎల్‌లో మట్టిపోయరాదు’



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

దండేపల్లి: చెరువు ఫుల్ ట్యాంకు లెవల్ (ఎఫ్‌టీఎల్)లో పట్టాభూములున్నా మట్టిపోయరాదని, బఫర్ ఏరియాలో పక్కా నిర్మాణాలు చేపట్టరాదని ఇరిగేషన్ ఈఈ రాము, డీఈ కుమార్ అన్నారు. దండేపల్లి మండలం నాగసముద్రం చెరువు ఫుల్‌ట్యాంకు లెవల్‌లో కొంత మంది మట్టిపోయడంతో నీటిమట్టం తగ్గుతోందని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు శనివారం ఈఈ, డీఈ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు పక్కన పట్టా భూములుండి, అది ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంటే నీళ్లు తగ్గినప్పుడు మాత్రమే సాగు చేసుకోవాలి తప్పా అందులో మట్టిపోయకూడదని సూచించారు. ఎవరైనా మట్టిపోస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

‘సమగ్ర’ ఉద్యోగుల మౌనదీక్ష



మౌనదీక్ష చేస్తున్న ఎస్ఎస్ఏలు

మంచిర్యాలఅగ్రికల్చర్: తమ డిమాండ్లు నెరవేర్చాలని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె 19వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా శనివారం ఎస్ఎస్ఏలు గాంధీ టోపీలు ధరించి మౌనదీక్ష చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుమలత, రాజన్న మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు.

కన్నీరే మిగిలింది..!

- క్షణికావేశంలో హత్యలు.. ఆత్మహత్యలు
- ప్రాణం తీసిన రోడ్డు ప్రమాదాలు
- పెరిగిన సైబర్ నేరాలు
- బాలికలపై ఆగని అఘాయిత్యాలు

మంచిర్యాలక్రైం: మానవుని జీవితంలో 2024 సంవత్సరం గతం కాబోతోంది. ఈ ఏడాదిలో ఏం జరిగిందని క్యాలెండర్ తిరగేసి చూస్తే.. ఏముంది గర్వ కారణం.. అంతా చీకటిమయం.. హత్యలు.. ఆత్మహత్యలు.. మహిళలపై అఘాయిత్యాలు.. రోడ్డు ప్రమాదాలు.. సైబర్ నేరాలు తదితర ఘటనలతో క్షణ క్షణం.. భయం భయం అన్నట్లుగా గడిచిపోయింది. బాధిత కుటుంబాల్లో కన్నీరే మిగిలింది. మహిళలు, బాలికలపై వేధింపులు, లైంగిక దాడులు పెరిగాయి. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో కేసుల ఛేదనలో పోలీసు శాఖ ముందున్నా.. చోరీ కేసుల్లో నగదు రికవరీలో పురోగతి సాధించడంలో వెనుకబడ్డారు.



ఆన్‌లైన్ ట్రేడింగ్, బెట్టింగ్, లోన్ యాప్ రుణాలకు బలైన కుటుంబం

కలిచివేసిన ఆత్మహత్యలు...

జిల్లాలో 2023లో 414మంది ఆత్మహత్య చేసుకోగా.. ఈ ఏడాది 418మంది బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇందులో రెండు ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను కలిచివేశాయి. మంచిర్యాలలోని రెడ్డి కాలనీకి చెందిన ఇప్ప వెంకటేష్(40) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఆన్‌లైన్ ట్రేడింగ్, బెట్టింగ్‌కు బానిసై రూ.25లక్షలు అప్పుల పాలయ్యాడు. లోన్‌యాప్‌ల్లోనూ రుణం తీసుకున్నాడు. లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులు భరించలేక భార్య వర్షిణి(33), ఇద్దరు కుమారులు రిషికాంత్(11), విహాంత్(3)లను హత్య చేసి తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. తాండూర్ మండలం కాసిపేటకు చెందిన సముద్రాల శివప్రసాద్ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి అప్పుల పాలయ్యాడు. దీంతో శివప్రసాద్ తల్లిదండ్రులు మొండయ్య, శ్రీదేవి, అక్క చైతన్యలతో ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది.

పథకం ప్రకారమే హత్యలు



మహేందర్‌ను కాల్చివేసిన స్థలంలో బూడిదను పరిశీలిస్తున్న డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్

వివాహేతర సంబంధాలు, భూ వివాదాలతో క్షణికావేశంలో హత్యలు, ఆత్మహత్యలు చోటు చేసుకున్నాయి. జిల్లాలో గత ఏడాదిలో 24 హత్యలు, 45 హత్యాయత్నాలు చోటు చేసుకోగా.. ఈ ఏడాది 22 హత్యలు, 40మందిపై హత్యాయత్నాలు జరిగాయి. గతంతో పోల్చి చూస్తే ఈసారి వరుస దాడులు పెరిగాయి. హత్య, హత్యాయత్నాలు కొంత మేర తగ్గాయి. చెన్నూర్ మండలం పొన్నారం గ్రామానికి చెందిన రామగిరి మహేందర్(35)తో అదే గ్రామానికి చెందిన వివాహిత పద్మ భర్త, ఇద్దరు పిల్లలను వదిలి ఐదేళ్లు సహజీవనం చేసింది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో భర్తతో కలిసి మహేందర్‌ను ఇంటికి పిలిపించుకుని పథకం ప్రకారం హత్య చేసి కాల్చివేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన జిల్లాలో సంచలనం సృష్టించింది.

హెల్మెట్ లేక ప్రాణాలు పోయాయి..!

2023లో 322 రోడ్డు ప్రమాదాలు జరుగగా.. ఈ ఏడాది 381 ప్రమాదాలు జరిగాయి. గత ఏడాది 115మంది మృతిచెందగా.. ఈ ఏడాది 123మంది చనిపోయారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు, మృతుల సంఖ్య పెరిగింది. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్లే మృతుల సంఖ్య పెరిగినట్లు తెలుస్తోంది. మందమర్రి మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన భరతపు తిరుపతి(31) మంచిర్యాల కాలేజీ రోడ్డులో తన భార్యను చూసేందుకు బుల్లెట్‌పై వెళ్తూ స్థానిక రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి మీద అదుపు తప్పి కిందపడ్డాడు. తల డివైడర్‌కు తగలడంతో తీవ్ర గాయమై అక్కడికక్కడే చనిపోయాడు. హెల్మెట్ ఉంటే చనిపోయి ఉండేవాడు కాదని పోలీసులు తెలిపారు.

పెరిగిన దొంగతనాలు, మహిళలపై అఘాయిత్యాలు..



చోరీ కేసులో రికవరీ చేసిన నగలు, నగదు

గత ఏడాది 283 చోరీలు జరుగగా.. ఈ ఏడాదిలో 348 దొంగతనాలు జరిగాయి. పోలీసుల నిఘా వైఫల్యం వల్ల చోరీల సంఖ్య పెరిగింది. మహిళలపై అఘాయిత్యాలు, పోక్సో కేసులు, లైంగిక వేధింపులు, సైబర్ నేరాలు గత ఏడాది కంటే ఎక్కువే జరిగాయి. మంచిర్యాలలోని డాక్టర్ విజయబాబు ఇంట్లో జరిగిన చోరీలో పోలీసులు నిందితులను పట్టుకుని చోరీ సొత్తు రికవరీ చేశారు. మిగతా కేసుల్లో రికవరీ నామమాత్రంగానే ఉంది.

మరిన్ని నేరాల తీరు..

కేసులు	2023	2024
హత్యలు	24	22
మిస్సింగ్	318	273
రేప్ కేసులు	27	41
కిడ్నాపింగ్	45	55
చీటింగ్	372	371

ముగ్గురిని మింగిన సెల్లార్...



మృతదేహాలను బయటకు తరలిస్తున్న దృశ్యం

మంచిర్యాలలోని బెల్లంపల్లి చౌరస్తా సమీపంలో నూతన భవన నిర్మాణంలో ముగ్గురు వలస కూలీలు దుర్మరణం చెందారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన హన్మంత్(35), ఆత్రం శంకర్(40), గోలేం పోషం(50) సెల్లార్ కూలడంతో మట్టిపెల్లలు మీదపడి చనిపోయారు.

కమ్యూనిటీ పోలీసింగ్...



మందులు పంపిణీ చేస్తున్న సీపీ ఎం.శ్రీనివాస్

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కమ్యూనిటీ పోలీసింగ్, నేను సైతం కార్యక్రమాల్లో పోలీసులు సుమారు రెండు వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కోటపల్లి సర్కిల్‌లోని నీల్వాయిలో ఉచిత వైద్య శిబిరం, యువతకు క్రీడాకిట్లు, గిరిజనతండాల్లో నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ తదితర కార్యక్రమాలతో ప్రజలకు చేరువయ్యారు. కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించి గుట్కా, గంజాయి, నిషేధిత వస్తువుల క్రయవిక్రయాలు అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించారు.

బల్దియా సమావేశాలకు బ్రేక్!



మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం

- సెప్టెంబర్ 30న చివరిసారి భేటీ
- మరో నెల రోజుల్లో ముగియనున్న పాలకవర్గం గడువు
- తీర్మానాలు లేక ముందుకు సాగని అభివృద్ధి పనులు


మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీల పాలకవర్గం పదవీకాలం జనవరితో ముగియనుంది. జిల్లా కేంద్రంగా ఉన్న మంచిర్యాల మున్సిపాలిటీలో సాధారణ సమావేశాలు నిర్వహించక మూడు నెలలు అవుతోంది. వచ్చే నెలలోనే వార్డు సభ్యుల పదవీకాలం ముగియనుంది. దీంతో ఈ నెలతో పాటు వచ్చే నెల రెండుసార్లు మున్సిపల్ సమావేశాలు నిర్వహించుకునేందుకు అవకాశం ఉంది. అయినప్పటికీ సమావేశాల నిర్వహణ చేపట్టక పోవడంతో పలు అభివృద్ధి పనులతో పాటు ఇతరత్రా పనులకు పాలకవర్గం తీర్మానం లేక ముందుకు సాగడం లేదు. ఐదేళ్ల పదవీకాలం ముగుస్తున్న వేళ పాలకవర్గ సభ్యులు మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన అంశాలపై చర్చించి తీర్మానం చేస్తారని అనుకున్నా మూడు నెలలుగా ఒక్క సమావేశం కూడా నిర్వహించకపోవడం గమనార్హం. డిసెంబర్ నెల కూడా చివరికి చేరుతోంది. ఈ మాసంలో కూడా సమావేశం నిర్వహించని పక్షంలో వరుసగా మూడు నెలలపాటు సమావేశాల నిర్వహణ లేకుంటే పాలకవర్గం రద్దు చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెలాఖరులోగా నిర్వహిస్తారా? లేదా అని పాలకవర్గ సభ్యులు ఎదురుచూస్తున్నారు. పాలకవర్గం పదవీకాలం జనవరి 27తో ముగియనున్నందు వల్ల మున్సిపల్ సమావేశం నిర్వహిస్తే తమ వార్డులో నెలకొన్న ముఖ్యమైన సమస్యలను పరిష్కరించుకునేందుకు అవకాశం ఉండేదన్న అభిప్రాయం కౌన్సిలర్లలో వ్యక్తమవుతోంది.

సమస్యల పరిష్కారం ఎలా?

మంచిర్యాల మున్సిపాలిటీ గ్రేడ్–1గా కొనసాగుతోంది. జిల్లా కేంద్రం కూడా కావడంతో ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే రైలు, రోడ్డు మార్గాలను అనుసంధానిస్తూ పలు నేషనల్ హైవే రోడ్లు ఉండడంతో పట్టణం మరింతగా విస్తరిస్తోంది. పెరుగుతున్న కాలనీలతో పాటు, ప్రస్తుతం ఉన్న కాలనీల ప్రజలకు తాగునీరు, డ్రెయినేజీలు, రోడ్ల నిర్మాణ పనులు, పారిశుధ్యం మెరుగుపర్చడం, పైపులైన్లు, విద్యుత్ మోటార్ల మరమ్మతులు వంటివి పాలకవర్గం ప్రతి నెలా నిర్వహించే సమావేశంలో తీర్మానం చేసేవారు. ఈ ఏడాది చివరిసారిగా సెప్టెంబర్ 30న మున్సిపల్ సమావేశం జరిగింది. ఆ తర్వాత డిసెంబర్ మాసం ముగింపునకు వస్తున్నా ఇప్పటి వరకు ఒక్క సమావేశం కూడా నిర్వహించక పోవడంతో కౌన్సిల్ ఆమోదం కావాల్సిన పనులన్నీ నిలిచిపోతున్నాయి. దీంతో పట్టణ ప్రజలు నిత్యం ఏదో ఒక సమస్యతో మున్సిపల్ కార్యాలయానికి వచ్చి కౌన్సిలర్లకు సమస్యలు విన్నవించినా పదవీకాలం దగ్గరపడుతుండడం, మున్సిపల్ సమావేశాల నిర్వహణ లేకపోవడంతో వారు సైతం ఏమీచేయలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. జిల్లా కేంద్రం అభివృద్ధి సైతం నిలిచిపోతుండగా పాలకవర్గం పదవీకాలం ముగిసేలోపు ఈ నెలతో పాటు వచ్చే నెలలోనూ సమావేశాల నిర్వహణ చేపట్టి ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు తీర్మానాలను చేయాలని బల్దియా ప్రజలు కోరుతున్నారు.

కలెక్టరేట్ ఎదుట జీపీ కార్మికుల ధర్నా

మంచిర్యాలఅగ్రికల్చర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం జీవో 51 తీసుకువచ్చి మల్టీపర్పస్ విధానం ద్వారా కార్మికులపై పని భారం మోపుతోందన్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, జీవో 51 సవరించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, జీవో 60 ప్రకారం కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలని, బ్యాంకు అకౌంట్లో వేతనాలు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాగర్, రాజలింగు, రాజన్న, సుధాకర్, బానయ్య, బాపు, రవి, దుర్గ, లక్ష్మి, యశోద, లత, మంగ, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

వేతనాల కోసం ఎదురుచూపులు



పనిస్థలంలో ఉపాధిహామీ కూలీలు

- ఇబ్బందుల్లో ఉపాధి హామీ ఉద్యోగులు
- క్రమం తప్పకుండా ఇవ్వాలని డిమాండ్

పాతమంచిర్యాల: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు డిసెంబర్ నెల వేతనాలు ఇవ్వడంలో జాప్యం జరగడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లు, కంప్యూటర్ ఆపరేటర్‌లు, ఈసీలు, ఏపీవోలు, హెచ్‌ఆర్ మేనేజర్‌లు వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఫీల్డ్ అసిస్టెంట్లు 187 మంది, కంప్యూటర్ ఆపరేటర్లు 35 మంది, ఈసీలు 12 మంది, ఏపీవోలు 12 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతీనెల మొదటి వారంలో జీతాలు ఇస్తుండగా ఈసారి నెల ముగియవచ్చినా జీతాలు రాకపోవడంతో ఇక్కట్లకు గురవుతున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. క్షేత్ర స్థాయిలో ఉపాధి పనులు జరుగాలంటే ఫీల్డ్ అసిస్టెంట్‌ల పాత్ర కీలకం. గ్రామాలలో కూలీలను సమీకరించడం, వారికి తగిన పనులు కల్పించడం, రిజిస్టర్‌లో పనుల నమోదు, కూలీలకు గిట్టుబాటయ్యే విధంగా పనులు నిర్వహించడం వారి విధి. ఇన్ని పనులు నిర్వహించినా వారికి అందే వేతనం కేవలం రూ.8 వేల నుంచి రూ.12 వేలలోపే. అంతతక్కువ వేతనానికి పనిచేస్తున్నప్పటికీ ఇస్తున్న అరకొర వేతనం కూడా సకాలంలో ఇవ్వడంలేదని వాపోతున్నారు. కుటుంబ పోషణ ఇబ్బందిగా మారడంతో అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రతీనెల వేతనాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



డిసెంబర్ వేతనాలు ఇప్పటి వరకూ రాకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. వచ్చే జీతం అంతంత మాత్రమే. అదికూడా సక్రమంగా రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. ప్రతీనెల క్రమం తప్పకుండా వేతనాలు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నక్క రాజన్న, ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు

జీతాల బడ్జెట్ పెండింగ్‌లో ఉంది



ఉపాధి హామీ ఉద్యోగుల డిసెంబర్ జీతాల బడ్జెట్ రూ.60 నుంచి రూ.70 లక్షల వరకు పెండింగ్‌లో ఉంది. ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. ఈ నెలాఖరు వరకు బడ్జెట్ విడుదల కానున్నట్లు తెలిసింది. బడ్జెట్ రాగానే వేతనాలు చెల్లిస్తాం.

– ఎస్. కిషన్ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

వేగంగా వరంగల్ హైవే...!

- చకచకా నాలుగు వరుసల రహదారి పనులు
- నాలుగు రాష్ట్రాలకు రవాణా సౌకర్యం మెరుగు

జైపూర్: మంచిర్యాల–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనుల్లో వేగం పుంజుకుంది. నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. ఒకవైపు 63వ నంబర్ జాతీయ రహదారి, మరో వైపు హైదరాబాద్ రాజీవ్ రహదారి రెండు ప్రధాన రహదారులను కలుపుకుని కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ హైవేరోడ్డు నిర్మాణంతో జైపూర్ రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. మంచిర్యాల జిల్లా రసూల్‌పల్లి కేంద్రంగా రింగ్ రోడ్డుతో కొత్త హైవే రోడ్డు ప్రారంభం కానుండగా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌కు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. ఇప్పటికే జిల్లాలో రైతుల నుంచి సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లింపులు సైతం 80 శాతం పూర్తికావడంతో హైవే రోడ్డుకు సంబంధించిన పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

110 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణం

మంచిర్యాల జిల్లా నుంచి వరంగల్–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ నాలుగు వరుసల ఎన్‌హెచ్–163జీ రోడ్డు నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. జైపూర్ మండలం రసూల్‌పల్లి కేంద్రంగా కొత్త హైవే రోడ్డు ప్రారంభం కానుండగా ఎల్కంటి, టేకుమట్ల, నర్సింగాపూర్, షెట్‌పల్లి, కుందారం, కిష్టాపూర్, వేలాల, పొనూర్ మీదుగా గోదావరినదిపై నుంచి పెద్దపల్లి జిల్లా మంథని, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ముత్తారం, మేదరిమెట్ల నుంచి వరంగల్ జిల్లా ఊరుగొండ, నెక్కొండ, జనగామ జిల్లా ఆలేరు, పెరుమాండ్ల నుంచి ఖమ్మం మీదుగా విజయవాడ వరకు రూ.3,440 కోట్లతో 110 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 22 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం సాగుతుండగా 50 కి పైగా చిన్నబ్రిడ్జీలు, 7 పెద్దబ్రిడ్జీలు నిర్మించనున్నారు. పనులు దక్కించుకున్న మేఘా ఇంజినీరింగ్ కంపెనీ ఇప్పటికే క్యాంపులను ఏర్పాటు చేసింది. నూతన సంవత్సరంలో సంక్రాంతి తర్వాత నుంచి ప్రధాన రోడ్డు నిర్మాణ పనుల్లో మరింత వేగం పెరనుంది. అన్నిరకాల అడ్డంకులు తొలగిపోవడంతో రెండేళ్ల నుంచి మూడేళ్లలోపు పనులు పూర్తికానున్నాయి.



63వ నంబర్ మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారి

జైపూర్‌కు హైవేకు కళ...

ఇప్పటికే జైపూర్ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. జైపూర్ వద్ద సింగరేణి సంస్థ 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు నెలకొల్పగా దానిని విస్తరిస్తూ మరోప్లాంటు ఏర్పాటు చేయనుంది. జైపూర్ మండలానికి ఒకవైపు జాతీయ రహదారి, మరోవైపు రాజీవ్ రహదారి ఉండగా వరంగల్–విజయవాడ హైవేతో కళ సంతరించుకోనుంది. హైవే రోడ్డు నిర్మాణంతో మండలంలో భూముల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఎకరాకు రూ.కోటికి పైగా ధర పలుకుతోంది. రాబోయే రోజుల్లో జైపూర్ మరింత అభివృద్ధి చెందనుండడంతో ఇక్కడ భూములు కొనుగోలు చేయడానికి ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు.

క్లుప్తంగా

వాహనం ఢీకొని కోతి మృతి


మృతి చెందిన కోతి

భీమారం: మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారిపై శనివారం పోలంపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కోతి మృతి చెందింది. వాహనదారులు కోతులకు ఆహారపదార్థాలు వేయగా అవి గుంపుగా వచ్చి తినే ప్రయత్నం చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన వాహనం ఢీకొనడంతో ఓ కోతి మృతిచెందింది. వారంలో కనీసం 10కి పైగా కోతులు మృతి చెందుతున్నాయి. ఇప్పటికైనా అటవీ అధికారులు జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహించి వాహనదారులు ఆహారం వేయకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

సోన్: లారీ డివైడర్ ఢీకొట్టిన ఘటన మండలంలోని గంజాల్ టోల్ ప్లాజా వద్ద చోటుచేసుకుంది.. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు.. మహారాష్ట్ర నుంచి కేరళలోని కొచ్చిన్‌కు ఫైబర్ డోర్స్ లోడుతో లారీ వెళ్తోంది. శుక్రవారం అర్ధరాత్రి గంజాల్ టోల్‌ప్లాజా వద్ద డ్రైవర్ నిద్రలో జారుకోవడంతో లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. క్లీనర్ అరుణ్ మురుగన్ ఫిర్యాదుతో డ్రైవర్ సర్వరాజ్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై షేక్‌అహ్మద్ తెలిపారు.

భార్యపై హత్యాయత్నం

ఆదిలాబాద్‌టౌన్: భార్యపై భర్త తీవ్రంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ కథనం ప్రకారం.. బొక్కల్‌గూడకు చెందిన సయ్యద్ అన్వర్ గత కొంతకాలంగా భార్యను తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నాడు. శనివారం భార్యపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గాయాలపాలైన ఆమెను కుటుంబీకులు రిమ్స్‌కు తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్వర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ తెలిపారు.

బావిలో దూకి ఆత్మహత్య

తలమడుగు: బావిలో దూకి ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం..ఆదిలాబాద్ పట్టణంలోని దుర్గానగర్‌కి చెందిన గంగన్న (41) బతుకుదెరువు కోసం మూడు నెలల క్రితం తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి వలసవచ్చాడు. కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగవద్దని భార్య మందలించడంతో క్షణికావేశంలో శనివారం రాత్రి రుయ్యాడి సమీపంలో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు.

సీవోఈ నోటిఫికేషన్ ఎప్పుడో?

- విడుదలలో జాప్యం
- ఎదురుచూస్తున్న విద్యార్థులు
- 'పది'లో మార్కుల ఆధారంగా ప్రవేశాలనే ప్రచారం
- అధికారిక ప్రకటన లేక ఊహాగానాలు



బెల్లంపల్లి సంక్షేమ బాలుర సీవోఈ కళాశాల ముఖద్వారం

బెల్లంపల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) కళాశాలల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నోటిఫికేషన్ కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, సంక్షేమ, జనరల్ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశపరీక్షకు ఈనెల 18న నోటిఫికేషన్ విడుదల కాగా, సీవోఈలో ప్రవేశానికి నోటిఫికేషన్ జారీలో జాప్యం జరుగుతోంది. ఏటా డిసెంబర్ రెండు లేదా మూడో వారంలో నోటిఫికేషన్ విడుదల చేస్తుండగా ఈసారి ఆలస్యం అవుతుండటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పదో తరగతిలో సాధించిన మార్కుల ప్రాతిపదికన విద్యార్థులకు ఈసారి అడ్మిషన్ కల్పిస్తారనే ప్రచారం జరుగుతోంది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) ఈవిషయంలో అధికారికంగా ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోయినప్పటికీ రకరకాలుగా ఊహాగానాలు వస్తున్నాయి. ఈకారణంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో పది వార్షిక పరీక్షలు రాయబోతున్న విద్యార్థులు ఎటూ తేల్చుకోలేక సతమతమవుతున్నారు. సీవోఈ ప్రవేశపరీక్షకు సిద్ధం కావాలా లేక పదో తరగతి పరీక్ష మెరుగ్గా రాయాలా అనే సందిగ్ధంలో ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో రెండు సీవోఈలు..

ఉమ్మడి జిల్లాలో సాంఘిక సంక్షేమ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీలు రెండు ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలో బెల్లంపల్లి కేంద్రంగా బాలుర సీవోఈ, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బాలికల సీవోఈ కళాశాలలు ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ప్రవేశపరీక్ష నిర్వహించి వీటిలో మెరిట్ విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు. ఒక్కో కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో రెండేసి సెక్షన్ల చొప్పున 80 మంది విద్యార్థులకు అడ్మిషన్ కల్పిస్తారు. సాధారణ గురుకులాల కన్నా సీవోఈ కళాశాలల్లో ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఇంటర్ విద్యాబోధన చేస్తూనే నీట్, ఎంసెట్ తదితర పోటీ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉన్నతంగా తీర్చిదిద్దుతారు. సీవోఈ కళాశాలల్లో ప్రవేశానికి విద్యార్థుల్లో విపరీతమైన క్రేజీ ఏర్పడి ఏటేటా పోటీ రెట్టింపవుతోంది.

విద్యార్థులకు వరం..

సీవోఈల్లో ప్రవేశం దక్కితే చాలు విద్యార్థుల భవిష్యత్ బంగారు మయమవుతుందనేది తల్లిదండ్రుల ఆశ. ఈకారణంగానే పదో తరగతి చదువుతున్న తమ పిల్లలకు సీవోఈ ప్రవేశపరీక్ష రాయడానికి ప్రత్యేకంగా కోచింగ్ ఇప్పిస్తుండటం చేస్తున్నారు. ప్రవేశం పొందిన విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదువులో, పోటీ పరీక్షల్లో నెగ్గేలా ఉన్నతంగా తీర్చిదిద్దడంలో సీవోఈలు ప్రత్యేకతను ఏర్పరుచుకున్నాయి. ఈ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పోటీ పరీక్షలు రాసి ఏటా పదులసంఖ్యలో ఇంజినీరింగ్, మెడిసిన్ సీట్లతోపాటు ఐఐటీలోనూ ప్రవేశం పొందుతున్నారు.

వారంలో వస్తుంది



విద్యార్థులు ఎలాంటి గందరగోళానికి గురికావద్దు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ కళాశాలల్లో ప్రవేశానికి ఎప్పటిమాదిరిగా ఈసారి ప్రవేశపరీక్ష నిర్వహిస్తాం. పదో తరగతిలో వచ్చిన మార్కుల ప్రాతిపదికన సీటు కేటాయించడం జరగదు. ప్రవేశపరీక్షకు సంబంధించి వారంలో నోటిఫికేషన్ వస్తుంది. విద్యార్థులు పరీక్షకు సిద్ధమై ప్రతిభను చాటుకోవాలి.

– అరుణకుమారి, జోనల్ అధికారి, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ

కార్యదర్శి కక్కుర్తి

- రాజీనామా చేసిన కారోబార్ వేతనం నొక్కేశాడు
- ఆరు నెలల వేతనాలు మరొకరి ఖాతాలో జమ
- విషయం తెలిసి ఫిర్యాదు చేసిన మాజీ కారోబార్

కోటపల్లి: పంచాయతీ కారోబార్‌గా రాజీనామా చేసిన వ్యక్తి పేరిట ఆరునెలల వేతనాలను వేరే వ్యక్తి బ్యాంక్ ఖాతాలో వేయించి కార్యదర్శి నొక్కేశాడు. ఈ ఘటన కోటపల్లి మండల కేంద్రం పంచాయతీలో ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కోటపల్లి పంచాయతీలో 2021–24 వరకు కారోబార్‌గా కొంకటి సుందర్ పనిచేశాడు. వ్యక్తిగత కారణాలతో గత జూన్‌లో రాజీనామా చేశాడు. కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న సత్యనారాయణ.. సుందర్ పేరిట నెల వేతనం రూ.21,450, ఇలా ఆరునెలల వేతనాలను చెన్నూర్ పట్టణానికి చెందిన నలమాసు రమేశ్ అకౌంట్‌లో జమ చేశాడు. విషయం తెలుసుకున్న సుందర్.. కోటపల్లి పంచాయతీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ మహేంద్రనాథ్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. కోటపల్లి, పంగిడి సోమారం కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ పంచాయతీ నిధులు స్వాహాచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు కార్యదర్శిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోటపల్లి గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో లక్ష్మయ్య, తహసీల్దార్ మహేంద్రనాథ్ వివరణ కోరగా కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నిధులు రికవరీ చేసి కోటపల్లి ఇన్‌చార్జిగా సత్యనారాయణను తొలగిస్తామన్నారు.

విహారయాత్రలో విషాదం

- కర్ణాటకలోని మైసూరు వద్ద కారు బోల్తా
- ప్రమాదంలో ఇద్దరు మృతి, మరో ఇద్దరికి గాయాలు
- మృతుల్లో మంచిర్యాల యువకుడు

మంచిర్యాలక్రైం: డిసెంబర్ 31 సెలబ్రేషన్స్ కోసం కర్ణాటక వెళ్లిన నలుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల విహారయాత్ర విషాదంగా మారింది. సంతోషంగా గడపాలనుకున్న వారి ఆశ మార్గమధ్యలోనే ఆవిరైంది. శనివారం తెల్లవారుజాము మైసూరు సమీపంలో వీరి కారు బోల్తాపడిందని సమాచారం. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మృతుల్లో మంచిర్యాల వాసి యువకుడు ఉన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..జిల్లాకేంద్రంలోని దొరగారిపల్లెకు చెందిన బల్జపల్లి శంకరమ్మ–వెంకన్న కుమారుడు సందీప్ హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సందీప్ తన మరో ముగ్గురు స్నేహితులతో కలిసి శుక్రవారం కారులో కర్ణాటకకు బయల్దేరారు. శనివారం వేకువజామున మైసూరు సమీపంలోకి చేరుకోగా అదుపు తప్పి బోల్తాపడినట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో సందీప్ మృతి వార్త విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మైసూరు బయల్దేరి వెళ్లారు. సందీప్ మృతితో దొరగారిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆదివారం సాయంత్రం సందీప్ మృతదేహం మంచిర్యాలకు చేరుకునే అవకాశం ఉంది.


సందీప్ (ఫైల్)

నిర్మల్‌లో వివాహితపై లైంగికదాడి

- భర్తతో గొడవపడి బయటకు వచ్చిన మహిళ
- లాడ్జికి తీసుకెళ్లి ఓ వ్యక్తి అఘాయిత్యం
- బాధితురాలికి ఎస్పీ జానకీ షర్మిల పరామర్శ


బస్టాండ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల, డీఎస్పీ గంగారెడ్డి, సీఐ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలో వివాహితపై లైంగికదాడి జరిగింది. రాత్రి సమయంలో భర్తతో గొడవపడి బయటకు వచ్చిన ఆమె నిస్సహాయతను ఆసరాగా చేసుకుని ఓ వ్యక్తి లాడ్జికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా కేంద్రానికి చెందిన మహిళ భర్తతో గొడవపడి శుక్రవారం రాత్రి 11గంటల ప్రాంతంలో బస్టాండ్‌కు వచ్చింది. అక్కడ యోగేష్ అనే వ్యక్తి ఆమెకు పరిచయం అయ్యాడు. డబ్బులు అవసరం ఉన్నాయని ఆమె అడుగగా.. యోగేష్ తనకు పరిచయం ఉన్న కళ్యాణ్ అనే వ్యక్తికి ఫోన్ చేసి రప్పించాడు. బస్టాండ్‌కు వచ్చిన కళ్యాణ్ ఆమెను పట్టణంలోని ఓ లాడ్జికి తీసుకెళ్లాడు. లొంగదీసుకోవాలని ప్రయత్నించగా ఆమె నిరాకరించింది. దీంతో ఆమెపై బలవంతంగా లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం బస్టాండ్‌కు వచ్చిన మహిళ ఓ ఆటోలో స్పృహకోల్పోయి పడిపోయింది. ఆటోడ్రైవర్ అక్కడే ఉన్న బ్లూకోల్ట్స్ సిబ్బందికి సమాచారం అందించాడు. వెంటనే ఆ మహిళను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ జానకీ షర్మిల శనివారం ఆమెను ఆస్పత్రిలో పరామర్శించారు. అనంతరం బస్టాండ్ ప్రాంతంలోని ఘటన స్థలాన్ని క్లూస్ టీం సిబ్బందితో కలిసి పరిశీలించి వివరాలు సేకరించారు. రాత్రి సమయంలో డ్యూటీ చేసే పోలీసులకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

ఘటనపై మంత్రి సీతక్క ఆరా

జిల్లా కేంద్రంలో వివాహితపై జరిగిన అత్యాచార ఘటన గురించి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క శనివారం రాత్రి ఆరా తీశారు. ఎస్పీ జానకీ షర్మిలతో ఫోన్‌లో మాట్లాడారు. అత్యాచారానికి పాల్పడినవారు ఎంతటి వారైనా ఉపేక్షించొద్దని ఆదేశించారు.

బెల్లంపల్లి అభివృద్ధికి 'సొసైటీ' నిధి..!

- అప్పట్లో రూ.6 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్
- రూ.40 లక్షలకు చేరిన వైనం..


సమావేశమైన ప్రస్తుత కమిటీ సభ్యులు (ఫైల్)

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ప్రజోపయోగ అవసరాల రీత్యా సారా కాంట్రాక్టర్ల వద్ద నుంచి వసూలు చేసిన చందా డబ్బులు బ్యాంకులో భద్రంగా ఉన్నాయి. నాలుగు దశాబ్దాల క్రితం అప్పటి రాజకీయ, కార్మిక, వ్యాపార, పుర ప్రముఖులు ఏకమై బ్యాంకులో రూ.6 లక్షలు ఫిక్స్‌డ్ చేయగా ప్రస్తుతం రూ.40 లక్షల వరకు చేరుకున్నాయి. వీటిని భవిష్యత్ ప్రజోపయోగ కార్యక్రమాలకు ఖర్చు చేయాలనే పట్టుదలతో ఉండగా, సరైన అవసరాలను గుర్తించడంలో నిర్లక్ష్యం జరుగుతోంది.

ముగ్గురు సభ్యుల సంతకాలతో..

రూ.6 లక్షల చందా డబ్బులను అప్పటి స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ప్రస్తుత ఎస్బీఐ) బెల్లంపల్లి శాఖ బ్యాంకులో ఫిక్స్‌డ్ చేశారు. కమిటీ సభ్యులు తాటిపాముల నాగయ్య, గోనే శ్యాంసుందర్‌రావు, రతన్‌లాల్ ఈ ముగ్గురిలో ఇద్దరు సంతకం చేసి డబ్బులు విత్‌డ్రా చేసేలా నిర్ణయించారు. ఇప్పటివరకు రూ.5 లక్షల వరకు విత్‌డ్రా చేసి ఖర్చుపెట్టారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ, అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.4 లక్షలు, భారత స్వర్ణోత్సవ వేడుకల నిర్వహణకు రూ.లక్ష వెచ్చించారు. మిగతా డబ్బులు బ్యాంకులో నిల్వ ఉండటం గమనార్హం.

1982లో సొసైటీ రిజిస్ట్రేషన్

సింగరేణి బొగ్గు గనులతో 1980లో బెల్లంపల్లి ఎంతగానో విరాజిల్లింది. పారిశ్రామిక క్షేత్రంగా ఉన్న బెల్లంపల్లిని విద్యా, సాంస్కృతిక పరంగా అభివృద్ధి చేసుకోవాలనే లక్ష్యంతో 'ది బెల్లంపల్లి ఎడ్యుకేషనల్, కల్చరల్, సోషల్ డెవలప్‌మెంట్ సొసైటీ'ని ఏర్పాటు చేసి 1982లో రిజిస్ట్రేషన్ చేయించారు. సొసైటీ చైర్మన్‌గా బాశెట్టి గంగారాంను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా అప్పటి మాజీ ఎమ్మెల్యేలు గుండా మల్లేశ్, దాసరి నర్సయ్య, రాజకీయ, కార్మిక నాయకులు బాశెట్టి గంగారాం, తాటిపాముల నాగయ్య, చిప్ప నర్సయ్య, నామసాని రామారావు, వ్యాపార వర్గాలు రతన్‌లాల్, తేజ్ ప్రకాశ్, మంచిర్యాలకు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు గోనే శ్యాంసుందర్‌రావు, అప్పటి బడా సారా కాంట్రాక్టర్ కె.సాగర్‌రావు ఉన్నారు. కాగా, కమిటీ సభ్యుల్లో గుండా మల్లేశ్, డి.నర్సయ్య, బి.గంగారాం, టి.నాగయ్య, ఎస్.రామారావు, రతన్‌లాల్ మృతిచెందారు.

నిర్దేశిత లక్ష్యాలు

బెల్లంపల్లి అభివృద్ధికి కమిటీ సభ్యులు పలు లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. ప్రభుత్వ రంగంలో డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలలు, వ్యవసాయ పరిశోధన కేంద్రం మంజూరు, హైదరాబాద్–న్యూఢిల్లీ మార్గంలో ఉన్న బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌కు చర్యలు, ఆడిటోరియం నిర్మాణం, శ్మశానవాటికల్లో, పోచమ్మ చెరువు వద్ద కర్మకాండల నిర్వహణకు షెడ్లు, ఆర్టీసీ బస్‌డిపో మంజూరు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి, టీబీ రోగుల కోసం ఆసుపత్రి ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

పారదర్శకత పాటిస్తాం

బెల్లంపల్లి అభివృద్ధి కోసం వసూలు చేసిన చందా డబ్బులు బ్యాంకులో రూ.40 లక్షల వరకు పోగయ్యాయి. కమిటీ సభ్యుల్లో పలువురు మృతిచెందారు. వీరి స్థానంలో కొత్త సభ్యులను ఎన్నుకోవల్సి ఉంది. చందా డబ్బుల లెక్కలను ప్రజలకు త్వరలోనే బహిరంగ పరుస్తాం. దాపరికంగా వ్యవహరించం. పారదర్శకతను పాటిస్తాం.– గోనే శ్యాంసుందర్‌రావు, అభివృద్ధి కమిటీ సభ్యుడు

కొత్త కమిటీని ఏర్పాటు చేయాలి

కొత్త కమిటీని ఏర్పాటు చేసి సరైన మార్గదర్శకం చేయాల్సిన అవసరం ఉంది. బెల్లంపల్లిలో వ్యవసాయ పరిశోధన కేంద్రం, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, పీజీ, బీఎడ్, మహిళా డిగ్రీ కళాశాలల మంజూరుకు కృషి చేయాల్సి ఉంది. సాంస్కృతిక కార్యక్రమాలకు ఆడిటోరియం, పేదలకోసం ఫంక్షన్ హాల్ నిర్మించాలనే డిమాండ్ ఉంది. చదువులో రాణిస్తున్న పేదవిద్యార్థులను ప్రోత్సహించడానికి ఆర్థిక సాయం అందించాలని పలువురు కోరుతున్నారు.

గత యూనియన్ల అలసత్వంతోనే సమస్యలు



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

రెబ్బెన(ఆసిఫాబాద్): గతంలో గుర్తింపు కార్మిక సంఘంగా పనిచేసిన యూనియన్ల అలసత్వంతోనే కార్మికుల అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ముష్క సమ్మయ్య అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని వివిధ డిపార్టుమెంట్లలో శనివారం ఏఐటీయూసీ గేట్ మీటింగ్‌లు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వారు హాజరై మాట్లాడారు. సింగరేణి స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో యాజమాన్యంతో చర్చించిన అంశాలను కార్మికులకు వివరించారు. సొంత ఇల్లు పథకం అమలు, 200 గజాల ఇంటి స్థలం, పెర్క్స్‌పై ఐటీ యాజమాన్యం చెల్లించేలా చూస్తామని, కొత్త ఇన్సెంటివ్ విధానాన్ని ప్రవేశపెడతామని, గైర్హాజరు శాతం తగ్గించేందుకు ప్రతి మూడు నెలలకోసారి మాస్టర్ల ప్రతిపాదికన ప్రోత్సాహక బహుమతి ఇచ్చేవిధంగా యాజమాన్యంతో మాట్లాడామని అన్నారు. జూనియర్ అసిస్టెంట్స్ ప్రమోషన్ పాలసీలో మార్పులు, బదిలీ వర్కర్స్ విధానాన్ని ఎత్తివేసి జనరల్ మజ్దూర్‌గా అపాయింట్‌మెంట్ అయ్యే విధంగా చూస్తామన్నారు. డిస్మిస్ కార్మికులను వన్‌టైం సెటిల్‌మెంట్‌గా తీసుకునేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. సమావేశంలో గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేషు, జగ్గయ్య, రాజేష్, కిరణ్‌బాబు, ఆనంద్, దివాకర్, ఫిట్ కార్యదర్శులు శ్రీనివాస్, రామయ్య, అశోక్, నాయకులు ఓదెలు, శ్రీనివాస్, అంజయ్య, రాంకిషన్, గోపాల్, సురేష్‌కోరి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సీఆర్టీల నిరవధిక సమ్మెకు మద్దతు


మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఉమ్మడి జిల్లాకు చెందిన సీఆర్టీలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. శనివారం నాటికి సమ్మె 13వ రోజు చేరింది. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆదిలాబాద్ మాజీ జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్‌లు వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆరు నెలల వేతనాలు అందకపోవడంతో సీఆర్టీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉద్యోగ క్రమబద్ధీకరణతోపాటు ప్రమాదంలో మృతిచెందిన సీఆర్టీలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. తుడుందెబ్బ మహిళా నాయకురాలు పెందోర్ పుష్పరాణి, నాయకులు అలీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జలపాతం వద్ద 'బుల్లెట్‌రెడ్డి' షూటింగ్


పాట చిత్రీకరణలో హీరో, హీరోయిన్

బోథ్: మండలంలోని పొచ్చెర జలపాతం వద్ద శనివారం 'బుల్లెట్‌రెడ్డి'సినిమా షూటింగ్ నిర్వహించారు. జలపాతం అందాల మధ్య నిర్మాత , దర్శకుడు, హీరో ఆదిరెడ్డి, హీరోయిన్ హానికలకు సంబంధించి పాట చిత్రీకరించారు. జలపాతంతోపాటు అర్బన్ పార్కులోనే రెండు పాటలు పూర్తి చేశారు. తమకు సహకరించిన బోథ్ ప్రజలు, అధికారులకు హీరో ఆదిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

నాటిన మొక్కలకు ఆన్‌లైన్ నమోదు


యాప్‌లో నమోదు చేస్తున్న మాజీ సర్పంచ్

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కే) గ్రామంలో మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి ఆధ్వర్యంలో నాటిన మొక్కలను శనివారం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా నాటిన ప్రతీ మొక్కను ఫోన్ ద్వారా వనమాలి యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి మొక్కకు ఒక్క బార్‌కోడ్ వస్తుందని, ప్రపంచంలో ఎక్కడ నుంచైన చూసే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలోనే ముఖరా(కే) గ్రామంలో మొక్కలను ఆన్‌లైన్ చేయడం తొలిసారని పేర్కొన్నారు.

చెట్లపొదల్లోకి దూసుకెళ్లిన కారు

ఆదిలాబాద్‌రూరల్: మావల సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్లపొదల్లోకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఇచ్చోడ నుంచి పవన్, ప్రవీణ్‌లు కారులో శనివారం ఆదిలాబాద్‌కు వస్తున్నారు. మార్గమధ్యలో అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారికి చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

నారుమడుల్లో జాగ్రత్తలు పాటించాలి

- రైతులు సూచనలు పాటిస్తే దిగుబడులు


యామిని, ఏవో, చెన్నూర్

చెన్నూర్‌రూరల్: యాసంగి సీజన్‌లో వరి సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. కొందరు నారు పెంచేందుకు మడులు సిద్ధం చేసి విత్తనాలు చల్లారు. నారుమడుల పట్ల తగు జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని చెన్నూర్ ఏవో యామిని వివరిస్తున్నారు. నారుమడుల్లో కలుపు, ముఖ్యంగా ఊద సమస్యలు ఎక్కువగా ఉంటాయి. దీని నివారణకు ఎకరా నారుమడికి బుటాక్లోర్ 1.5 లీటర్ తీసుకుని 200ల లీటర్ల నీటిలో కలిపి విత్తనాలు విత్తిన సమయంలో లేక, 8వ రోజున మడిలో పిచికారీ చేయాలి. లేదా విత్తిన 14 నుంచి 15 రోజుల్లో సైహలోఫాప్ బ్యుటైల్ 10 శాతం 400మి.లీ. 200ల లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నాట్లు వేసిన 4 నుంచి 5 రోజులకు ఎకరాకు 30–40 గ్రాముల ఆక్సిడయార్జిల్ 25 కిలోల ఇసుకతో కలిపి చల్లుకోవాలి. పిచుకలు, అడవిపందులు రాకుండా నారుమడికి నాలుగు వైపులా నాలుగు పొడవాటి కర్రలు ఏర్పాటు చేసి కవర్లు తొడగాలి. గాలివీచినప్పుడు కవర్లు చప్పుడు అయ్యి అవి దగ్గరకు రావు. లేదంటే కర్రలకు ఖాళీ సీసాతోపాటు నట్‌బుల్లోట్‌ను ఏర్పాటు చేయాలి. లేదా పాత పళ్లానికి రంధ్రం చేసి దానికి బుల్లోట్ కట్టినట్లయితే గాలికి అవి కదిలి శబ్దానికి పిచుకలు, అడవిపందులు అటువైపుగా రావు. ఇలా చేస్తే రైతులు నారుమడులను కాపాడుకోవచ్చు.


వరినారు మడిని పరిశీలిస్తున్న ఏవో

తెలంగాణ ఉద్యమకారుడి మృతి

తానూరు: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష చేసిన భోసి గ్రామానికి చెందిన ఉద్యమకారుడు రాఘవులు (75) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. 2010 జనవరి 11న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొట్టమొదటగా తానూరు మండలం భోసి గ్రామంలో ఐదు రోజులు ఆయన అమరణ నిరహార దీక్ష చేపట్టారు. తెలంగాణ సాధనకు ఎంతో కృషిచేశారు. వయస్సు రీత్యా అనారోగ్యం బారినపడి నిజామాబాద్‌లోని ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటుండగా మృతిచెందారు. ఆయన మృతిపట్ల ఉద్యమకారులు గ్రామస్తులు సంతాపం ప్రకటించారు. ఉద్యమ సమయంలో అయన చేసిన సేవలను కొనియాడారు.


రాఘవులు (ఫైల్)